నష్టాల బాటలో కర్బూజ రైతు

- దళారుల పెత్తనం
- కర్బూజ కిలో రూ.5 నుంచి రూ.8 చెల్లింపు
- గిట్టుబాటు కావడం లేదంటున్న అన్నదాతలు

లోకేశ్వరం మండలం భాగాపూర్‌కు చెందిన రైతు కృష్ణారెడ్డి తనకున్న 12 ఎకరాల్లో నుంచి రెండున్నర ఎకరంలో యాసంగి సీజన్‌లో కర్బూజ సాగు చేశాడు. వాతావరణం కారణంగా దిగుబడి తగ్గింది. గతేడాదిలో రెండున్నర ఎకరాల్లో 56 టన్నుల దిగుబడి రాగా ఈ ఏడాది 30 టన్నుల దిగుబడి మాత్రమే వచ్చింది. దళారులకు కిలో రూ.8 చొప్పున విక్రయించగా 30 టన్నులకు రూ.2లక్ష 40 వేలు వచ్చాయి. సాగు చేస్తే అన్ని కలుపుకొని రూ.2లక్షల 10 వేల ఖర్చయింది. అన్నిపోను కేవలం రూ.30 వేలు మిగిలాయని బాధిత రైతు వాపోయాడు. ఈ పరిస్థితి జిల్లాలోని రైతులందరిదీ.



భాగాపూర్‌లో మల్చింగ్‌తో కర్బూజ సాగు

నిల్వ చేసే వీలు లేకనే



కర్బూజ దిగుబడి తగ్గింది. ఈ పండ్లు నిల్వ చేసుకునే వీలు లేకనే వ్యాపారులు సూచించిన ధరకు విక్రయించాం. కిలో రూ.5 చొప్పున ధర లభించింది. ఎకరాకు రూ. లక్ష తీసుకున్నా రైతులకు లాభం అంతంతే దక్కుతుంది. కర్బూజకు మార్కెట్‌లో డిమాండ్ ఉన్నా రైతులకు మాత్రం లాభం పరిమితం.

– మంద లింగన్న, రైతు

లోకేశ్వరం: కర్బూజకు మార్కెట్‌లో భారీగా డిమాండ్ ఉన్నా ఈ పంట సాగు చేసిన రైతులకు మాత్రం ఆశించిన లాభం దక్కడం లేదు. దళారీ చెప్పిన ధరకే పంట విక్రయిస్తున్నారు. రైతుకు దక్కాల్సిన లాభాలకు దళారులు గండికొడుతున్నారు. వేసవిలో చల్లదనం కోసం ప్రజలు ఇష్టపడి కర్బూజను తింటారు. మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.15 నుంచి రూ.20 ధర ఉంది. రైతులకు మాత్రం కిలో రూ.5 నుంచి రూ.8 చొప్పున వ్యాపారులు చెల్లిస్తున్నారు. యాసంగి సీజన్‌కుగాను లోకేశ్వరం, తానూర్, కుభీర్, సారంగాపూర్, మామడ, లక్ష్మణచాంద, భైంసా, ముధోల్ మండలాల్లో రైతులు దాదాపు 826 వందల ఎకరాల్లో కర్బూజ సాగు చేశారు. నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాలకు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతున్నాయి. భైంసా, నిజామాబాద్ వ్యాపారులు హోల్ సేల్‌గా రైతు ల నుంచి కొనుగోలు చేసి అవసరం ఉన్న ప్రాంతా లకు ఎగుమతి చేస్తున్నారు. రైతు ఒక కిలో రూ.5 నుంచి నాణ్యతను బట్టి రూ.8 వరకు చెల్లించి తీసుకెళ్తున్నారు. భైంసా, నిర్మల్, నిజామబాద్ మార్కెట్‌లో రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయిస్తుండగా అధి క లాభం వ్యాపారులకే దక్కుతుంది. సొంతంగా మార్కెటింగ్ చేసుకునే అవకాశం లేకనే దళారులను ఆశ్రయించక తప్పడం లేదని రైతులు వాపోతున్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన నూతన కమిటీ



కలెక్టర్ వరుణ్‌రెడ్డిని కలిసిన సభ్యులు

నిర్మల్: ఉపభోక్త ఏవం మానవ్ అధికార్ రక్షా సమితి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సురకంటి ఎల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా బి.నరేశ్, ప్రధాన కార్యదర్శిగా మన్నూరు ప్రశాంత్, లీగల్ అడ్వయిజరీగా కోట శేషగిరి, కార్యదర్శిగా శ్యామ్‌ను నియమించారు. ఈమేరకు నూతన కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పండితులు చక్రపాణి నరసింహమూర్తి, సందీప్‌శర్మ, కీర్తి రాఘవశర్మ, శరత్‌చంద్రశర్మ, నాగరాజు శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శాంతిహోమం, ఆలయ బలిహరణం, పంచామృతాభిషేకం, ముత్తయిదువులతో సామూహిక కుంకుమార్చన తోపాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన



విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షిస్తున్న అధికారులు

సారంగపూర్: మండలంలోని ఆలూరు జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను మంగళవారం జిల్లా స్థాయి అకడమిక్ మానిటరింగ్, ఎఫ్‌ఎల్‌ఎన్ అధికారి నర్సయ్య సెక్టోరియల్ అధికారి ప్రవీణ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. పాఠశాలల్లో పలు అంశాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అభ్యాసదీపికల్లో ఉన్న అంశాలను అర్థమయ్యే రీతిలో వివరించాలన్నారు. ఉపాధ్యాయుడు కిషన్, విద్యార్థులు, సిబ్బంది ఉన్నారు.

పాత సామగ్రి వేలం

ముధోల్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ రాజేందర్ ఆధ్వర్యంలో మంగళవారం పాత సామగ్రి (స్క్రాప్)ను వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో 9 మంది వ్యాపారులు ఒక్కొక్కరు రూ. 2 వేల చొప్పున ధరవత్తు చెల్లించి పాల్గొన్నారు. వ్యాపారి అక్తర్ రూ.40 వేలకు పాత సామాన్లు దక్కించుకున్నారు. ఇందులో పాత మోటార్లు, పాత పైప్‌లు, తుప్పుపట్టి వివిధ రకాల పైప్‌లు ఉన్నాయి. ఈవో పవన్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ అనూషగౌడ్, బిల్ కలెక్టర్ హేమలత, వార్డు సభ్యుడు ప్రకాశ్, నాయకుడు ఆజీమ్ ఉన్నారు.

రెండోరోజు స్వచ్ఛభారత్ మిషన్ సర్వే



సర్వేలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

నర్సాపూర్(జి): స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ) మూడు రోజుల శిక్షణలో భాగంగా రెండోరోజు మంగళవారం కుస్లీ గ్రామంలో పర్యటించారు. 'గ్రామ పారిశుధ్య ప్రణాళిక'ను తయారు చేసి కార్యదర్శులు, ఎఫ్ఏలు బృందాలుగా ఇంటింటికీ తిరుగుతూ మరుగుదొడ్డి, ఇంకుడు గుంతలు ఉపయోగిస్తున్నారా లేదా, తడి, పొడి చెత్తల నిర్వహణ, పారిశుధ్యం తదితర విషయాలపై సర్వే చేపట్టారు. అనంతరం గ్రామసభ నిర్వహించి పలు సందేహాలను నివృత్తి చేశారు. సర్పంచ్ స్వరూప భూమేష్, ఉప సర్పంచ్ సంతోష్, ఎంపీడీవో వనజ, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, సీడీపీవో నాగమణి, ఎస్బీఎం కన్సల్టెంట్ అబూజర్, ట్రైనర్ గంగాధర్ (ఏపీఎం, తానూర్), మహిళా సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

గ్రామాల శుభ్రత పాటించాలి



ప్రకృతివనం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో శివకృష్ణ

తానూరు: గ్రామాల శుభ్రత పాటించాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మండలంలోని ఉమ్రి(కే), బోరిగాం గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలన్నారు. ప్రతిరోజు పంచాయతీ ట్రాక్టర్ ద్వారా చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్డులో ఎరువులను తయారీ చేయాలన్నారు. అనంతరం ఉమ్రి(కే) గ్రామంలో ప్రకృతివనాన్ని పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా చూడాలని సూచించారు. బోరిగాంలో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారుల వివరాలను సేకరించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మోహన్‌సింగ్, ఉమ్రి(కే) పంచాయతీ కార్యదర్శి వినయ్, తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనులు నిలిపివేయాలి



తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేస్తున్న మేదరి కాలనీవాసులు

లోకేశ్వరం: మండల కేంద్రం నుంచి పంచగుడి వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు వెంటనే నిలిపివేయాలని మేదరి కాలనీవాసులు కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోకేశ్వరం సబ్‌స్టేషన్ నుంచి పశువైద్యశాల వరకు ఆర్‌అండ్‌బీ ఎలాంటి సర్వే చేయకుండానే రోడ్డు పనులు చేస్తున్నారన్నారు. దీంతో తమ సొంత ఇళ్ల స్థలాలు కోల్పోవాల్సి వస్తుందన్నారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కాలనీవాసులు రాజేశ్వర్, రాజమణి, చిన్నయ్య, నవీన్, గంగాధర్, రాజన్న, లక్ష్మణ్, గొల్ల లక్ష్మి, భోజవ్వ ఉన్నారు.

అంధత్వ నివారణకు 'కంటి వెలుగు'

- మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఈశ్వర్

నిర్మల్‌చైన్‌గేట్: అంధత్వ నివారణకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని 3వ వార్డులోని రాంరావ్ బాగ్‌లో రెండో విడత కంటివెలుగు శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో 42 వార్డుల్లో కట్టుదిట్టమైన ప్రణాళికతో ప్రజలందరినీ కంటి వెలుగులో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం కంటి చికిత్సతో పాటు కళ్లద్దాలు, మందులు ఉచితంగా అందిస్తోందన్నారు. ప్రజలందరూ ఉచిత కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ అదుముళ్ల రమాదేవి పద్మాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట సురేందర్, మహాలక్ష్మి ఆలయ చైర్మన్ గంగాధర్, కౌన్సిలర్లు నరహరి, నవీన్, కోఆప్షన్ సభ్యులు గోవర్ధన్, నర్సయ్య, రాందాస్, గంగన్న, భోజన్న, ఇప్ప అడేళ్ళు, సిద్ధ బబ్లు, నాందేవ్ పటేల్, డాక్టర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



అ'పూర్వ' సమ్మేళనం

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్ జెడ్పీఎస్ఎస్‌లో 2002-03 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గణపతిరావు, వెంకన్న, క్రాంతి, నర్సింహరాజు, డేవిడ్, గంగన్న సన్మానించారు. సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ ప్రేమలత, జేఎల్ఎం నర్సయ్య, కిరణ్, రాజమల్లు, కృష్ణప్రసాద్, అన్నపూర్ణ, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు



మాట్లాడుతున్న దేవి మురళి

లక్ష్మణచాంద: బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని బాలల సంరక్షణ అధికారి దేవిమురళి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో బాల్య వివాహాల చట్టం 2006పై వివిధ మత పెద్దలతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు ఎక్కడైనా జరుగుతున్నట్లు తెలిసిన, బాలలకు సంబంధించిన ఏమైనా సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1098కి ఫోన్ చేయాలన్నారు. సర్పంచ్ ముత్యంరెడ్డి, వరల్డ్ విజన్ జిల్లా కోఆర్డినేటర్ బ్రహ్మన్న, మండల కోఆర్డినేటర్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న అధికారులు

ఖానాపూర్: క్షయవ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మంగళవారం నిక్షయ్ దివస్ ఆరోగ్యమేళాలో భాగంగా పట్టణంలోని ఎమ్మెల్యేను వైద్య అధికారులు, సిబ్బంది కలిసి వ్యాధి నివారణపై చర్చించారు. అవసరమైతే ప్రజాప్రతినిధులు, నాయకులు క్షయ రోగులను దత్తత తీసుకుని వారికి పౌష్టికాహారం అందించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం ఆమెకు వినతిపత్రం అందించారు.

అవగాహన సదస్సు..

పట్టణంలోని విద్యానగర్–2 ఉపకేంద్రం పరిధిలోని తిమ్మాపూర్‌తో పాటు మండలంలోని రాజురా గ్రామంలో వేర్వేరుగా ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది క్షయ వ్యాధిపై రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో హెల్త్ ఎడ్యుకేటర్ జయలలిత, సర్పంచ్ చిన్నం లావణ్య, కార్యదర్శి రాణి, టీబీ సూపర్‌వైజర్ వేణుగోపాల్, ల్యాబ్ టెక్నీషియన్ శైలజ, నాయకులు పరిమి సురేశ్, తొంటి శ్రీనివాస్, జన్నారపు శంకర్, రాజగంగన్న, ఏఎన్ఎం పద్మ తదితరులు ఉన్నారు.

క్షయ నిర్మూలించాలి

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిని నిర్మూలించాలని ఎంఎల్‌హెచ్‌పీ అరుణ అన్నారు. మండలంలోని కన్కపూర్‌లో ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా మహిళలకు మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. క్షయ సోకినట్లయితే వైద్యులను సంప్రదించాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు దీప, కమల, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభ తదితరులు ఉన్నారు.

పెంచిన కరువు భత్యం అమలు చేయాలి

లక్ష్మణచాంద: బీడీ కార్మికులకు పెంచిన కరువు భత్యం వెంటనే అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి గంగన్న అన్నారు. వడ్యాల్‌లోని బీడీ ఫ్యాక్టరీ వద్ద బీడీ కార్మికులతో కలిసి మంగళవారం కరపత్రాలను విడుదల చేశా రు. కిషన్, శంకర్, సాయన్న, ఆశన్న, లింగన్న తదితరులు ఉన్నారు.

మంత్రిని కలిసిన నూతన కార్యవర్గం



మంత్రి ఐకేరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్/నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని ఇటీవల నూతనంగా ఎన్నుకున్న బెస్తవార్ పెట్ మున్నూరుకాపు సంఘ కార్యవర్గ సభ్యులు మంగళవారం రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కమిటీ సభ్యులు మంత్రిని, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్‌ను సన్మానించారు. అనంతరం కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని సభ్యులు తెలిపారు. నాయకులు అశోక్, తోట రవి, తోట రమేశ్, పంతికే శ్రీనివాస్, పంతికే రాజేందర్, ఈదన్నగారి రాజేశ్వర్, పంతికే అనిల్, బండారి రాజేశ్వర్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



భైంసారూరల్: చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: భైంసా డివిజన్‌లోని ఆయా మండలాలకు చెందిన పలువురు బాధిత కుటుంబీకులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పంపిణీ చేశారు. తానూరు మండలం దౌలతాబాద్ గ్రామానికి చెందిన సుశీలకు రూ.73500, కర్బాలకు చెందిన ఫారూబాయికి రూ. 89500, కర్బాలకు చెందిన మారుతికి రూ.1.50లక్షలు, భైంసా మండలం చింతల్‌బోరికి చెందిన వెంకట్‌రావుకు రూ.28వేలు, కుంబికి చెందిన సూర్యవంశీ శంకర్‌పటేల్‌కు, రూ. 2.50లక్షలు, దేగాం గ్రామానికి చెందిన నారాయణ రెడ్డికి రూ. లక్ష మంజూరయ్యాయి. మంగళవారం దేగాంలోని తన నివాసంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చెక్కులు అందజేశారు. మాజీ జడ్పీటీసీ సూర్యం రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు గజానంద్, లింగా సర్పంచ్ గణేశ్, నాయకులు ముత్యంరెడ్డి, గణేశ్, పండిత్, లస్మన్న, మధుకర్, గోపి ఉన్నారు.

దస్తురాబాద్: మండల పరిషత్ కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని బుత్కూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయం వద్ద హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజునాయక్, మున్యాల సర్పంచ్ శంకర్, నాయకులు రాజనర్సయ్య, రాజలింగం, గోపి, సత్తన్న, గంగన్న పాల్గొన్నారు.

వీడ్కోలు సమావేశం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు నాల్గవ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ బాబారావు, వైస్ చైర్మన్ అనిత, హెచ్ఎం ఎలన్న, కార్యదర్శి సారిక, సీఆర్పీ రాజేశ్వర్, ఉమారాణి, మానస, నర్సయ్య మధుపటేల్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించినవారిని శిక్షించాలి'

భైంసాటౌన్: లోకేశ్వరం మండలంలోని బామ్ని(కె) గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానపర్చిన దుండగులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం భైంసాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. భీంరావు డోంగ్రే, గిరిధర్ జంగ్మే, గౌతం పింగ్లే, రాహుల్ దగ్డే, సాహెబ్‌రావు, శంకర్, తదితరులున్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

సారంగపూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల్లో పోషకాహార లోపంతో వయస్సుకు తగిన బరువు పెరగరని, తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో చిన్నారుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయగౌరి, జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో సరోజ, సర్పంచ్ సుజాత, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణమోహన్ గౌడ్, ఐకేపీ ఏపీఎం మాధురి ఉన్నారు.

గురుకులంలో వైద్యశిబిరం

ముధోల్: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల కళాశాలలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యుడు అవినాష్ విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారిని గుర్తించి చికిత్స అందజేశారు. ఈ వైద్యశిబిరాన్ని తహసీల్దార్ శ్యాంసుందర్ పరిశీలించారు.

కొనసాగుతున్న కంటి శిబిరాలు

ఖానాపూర్: పట్టణంలోని పలు కాలనీల్లో రెండో విడత కంటివెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయి. కంటివెలుగు అధికారి సలేహ బేగం, ఆప్తాల్మిక్ అధికారి నికిత, ఖానాపూర్ సూపర్‌వైజర్ సుజాత, డీఈవో రాఘవేందర్, ఏఎన్ఎం పార్వతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కడెం: మండలంలోని పెద్దూర్ గ్రామానికి చెందిన బొర్లకుంట రాజేశ్ తండ్రి రాయపోశం, కల్లెడ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మి, బొడ్డు గోపాల్ ఇటీవల మృతిచెందారు. మంగళవారం ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ బాధిత కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కుంటాల: మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

లక్ష్మణచాంద: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి పథకం నిధులతో సీసీ రోడ్డు పనులను సర్పంచులు మంగళవారం ప్రారంభించారు. సర్పంచ్ బొర్రవ్వ, ఎంపీటీసీ రమా, రైతు బంధు మండల అధ్యక్షుడు గంగారాం, ఉపసర్పంచ్ ముత్యం ఉన్నారు.

పీఎఫ్ డబ్బులు ఇప్పించాలని వినతి

భైంసాటౌన్: పీఎఫ్ డబ్బులు ఇప్పించాలంటూ పట్టణానికి చెందిన పాండురంగ్‌పాటిల్, దిగంబర్ పాటిల్, మారుతిపాటిల్‌లు కార్మిక శాఖ అధికారిణి శ్రావణిని కోరారు. ఈ మేరకు శాఖ పట్టణ కార్యాలయంలో మంగళవారం ఆమెను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో తాము పట్టణంలోని జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో పనిచేశామని, అయితే సదరు ఫ్యాక్టరీ యజమానులు తమకు పీఎఫ్ డబ్బులు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల సదస్సు

సారంగపూర్: మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ ఈశ్వరయ్య, టెక్నికల్ సభ్యుడు అశోక్ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కిషన్, భూమారెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. మండలంతోపాటు దిలావర్‌పూర్, లక్ష్మణచాంద, నిర్మల్ రూరల్ మండలంలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను విన్నవిస్తే పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన

ముధోల్: మండలంలోని విఠోలితండా, మచ్కల్ గ్రామాల్లో మంగళవారం ఉపాధిహామీ పనులను ఎంపీడీవో సురేష్ బాబు పరిశీలించారు. అదేవిధంగా విఠోలి గ్రామంలో సీసీ రోడ్డు పనులు, నర్సరీని పరిశీలించారు. సర్పంచ్ సత్యగౌడ్, ఏపీవో శిరీష, పంచాయతీ కార్యదర్శి సంతోశ్ ఉన్నారు.

నేటినుంచి అడెల్లి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం గ్రామంలో అడెల్లి పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని 15 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముస్తాబైన ఆలయం

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేటలో శ్రీసీతారామ, రామలింగేశ్వర స్వామి ఆలయం విగ్రహప్రతిష్ఠాపనకు ముస్తాబైంది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నుంచి ఈనెల 18వరకు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించనున్నారు.

బ్యాంకు ఖాతాలపై అవగాహన

మామడ: మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాలలో మంగళవారం ఎస్బీఐ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకంలో భాగంగా బ్యాంకు ఖాతాలపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థికి ఖాతాను అందిస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది నరసింహస్వామి, గలాంనబీ, సౌజన్య పాల్గొన్నారు.

'దళితబంధు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు అవకాశమివ్వాలి'

ఖానాపూర్: దళితబంధు పథకం కోసం లబ్ధిదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేలా ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని గిరిజన శక్తి రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిద్ధార్థనాయక్ కోరారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. దళితబంధు పేరుతో డబ్బులు వసూలు చేస్తూ మోసగిస్తున్న దళారులపై పీడీయాక్ట్ కింద కేసులు నమోదు చేయాలన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపి

తానూరు: మండల కేంద్రంలోని భవిత విద్యావనరుల కేంద్రంలో దివ్యాంగుల విద్యార్థులకు మంగళవారం ఫిజియోథెరపి వైద్యపరీక్షలు నిర్వహించారు. మొతం 23 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు ఫిజియోథెరపిస్ట్ వైద్యుడు శ్రీనివాస్ తెలిపారు. ప్రతి మంగళవారం భవిత విద్యావనరుల కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని వికలాంగ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఆర్‌టీ భూమన్న, రాము, సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో బాసర ఆలయ సేవలు ప్రారంభం

భైంసా: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ ఈ–హుండీ సేవలను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో దశలవారీగా ఆన్‌లైన్ సేవలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సేవలు కల్పించేందుకు ఆన్‌లైన్‌లో పూజలు, వసతి బుకింగ్, ప్రసాదం పంపిణీ సేవలు అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ముందుగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయన ఆన్‌లైన్ సేవలను ప్రారంభించారు.

పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణం పరిశీలన

సారంగపూర్: మండలంలోని ఆలూరులోని పల్లె ప్రకృతివనం, క్రీడా ప్రాంగణం, డంపింగ్ యార్డు, నర్సరీలను మంగళవారం జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం సోనాపూర్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అక్కడినుంచి దుప్యాతండాలో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఎంపీడీవో సరోజ, ఏపీవో, తదితరులు ఉన్నారు.